సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| శుక్రవారం 03 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 305 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## ప్రజా పాలన-99 రోజుల ప్రగతి ప్రణాళిక'తో గ్రామ సమస్యల పరిష్కారం లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు జరుగుతున్న నేపథ్యంలో 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సందేశం అందిస్తూ ప్రభుత్వం సేవాభావంతో పనిచేస్తూ ప్రజల అవసరాలనే కేంద్రంగా తీసుకుని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పారదర్శక పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని, ప్రతి గ్రామంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అర్హులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. "తెలంగాణ రైజింగ్ 2047" విజన్‌తో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా కొనసాగుతోందని, ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని సీఎం పిలుపునిచ్చారు.

## ఆకాశవాణి లక్నో 89వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ







లక్నో, సందేశం టైమ్స్ ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: చిన్నతనంలో మనందరి చెవుల్లో పడిన మొట్టమొదటి స్వరం ఆకాశవాణి అని, ప్రజా సేవా ప్రసారాలు మరియు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో ఈ సంస్థ పాత్ర అపూర్వమని ప్రముఖులు కొనియాడారు. లక్నోలో నిర్వహించిన ఆకాశవాణి 89వ స్థాపక దినోత్సవ వేడుకలు, గౌరవ వందన కార్యక్రమం మరియు సాంస్కృతిక సంధ్యలో భాగంగా పద్మ అవార్డు గ్రహీతలతో పాటు ఆకాశవాణి అభివృద్ధికి విశేష కృషి చేసిన సీనియర్ ప్రజా సేవా ప్రసారకులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. 88 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఆకాశవాణి లక్నో పరివారానికి మరియు సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి సేవలు భవిష్యత్తులో మరింత ఉన్నతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.



### భద్రాచలం చుట్టుపక్కల ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపండి – బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు

సందేశం టైమ్స్, భద్రాచలం, ఏప్రిల్ 3, ప్రతినిధి: రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించామని గుర్తుచేసిన బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర భద్రాచలం పట్టణానికి సమీపంగా ఉన్న ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన తెలిపారు, వీటిలోని ఎటపాక, కన్నాయి గూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తమ పట్నం, గుండాల గ్రామాలు భద్రాచలం పట్టణానికి చుట్టుపక్కల ఉండటంతో ఈ గ్రామాలను తెలంగాణలో మళ్లీ చేర్చడం అవసరమని ఆయన డిమాండ్ చేశారు.

## ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాల నిర్మాణం పరిశీలన

### తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (FCDA) కార్యాలయం మరియు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (YISU)కి చెందిన భవన సముదాయాలను పరిశీలించడానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు సమీక్షల ఘట్టం నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ భవన నిర్మాణ పనులతో పాటు ప్రాంత రూపకల్పనలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణాలను మరింత వేగవంతం చేయమని ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారు, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ సుబ్బారావు గారు మరియు ఇతర అధికారులు జాన్ చేశారు.

## ఈజ్ ఆఫ్ లివింగ్' మరియు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు భారీ ఊతం

న్యూ ఢిల్లీ, సందేశం టైమ్స్ ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: దేశంలో 'ఈజ్ ఆఫ్ లివింగ్' మరియు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను మరింత బలోపేతం చేసే దిశగా పార్లమెంట్ జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2026ను ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. పౌరులను శక్తివంతం చేసే విశ్వాస ఆధారిత ఫ్రేమ్‌వర్క్‌ను ఈ బిల్లు బలోపేతం చేస్తుందని, కాలం చెల్లిన నిబంధనలు మరియు నిబంధనల ముగింపుకు ఇది నిదర్శనమని ప్రముఖులు పేర్కొన్నారు. అదే సమయంలో, ఈ బిల్లు ద్వారా పలు అంశాలను నేరరహితం (డిక్రిమినలైజేషన్) చేయడం వల్ల కేసుల త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని మరియు న్యాయపరమైన చిక్కుల భారం తగ్గుతుందని వివరించారు. ఈ బిల్లును రూపొందించడంలో అనుసరించిన సంప్రదింపుల విధానం ఎంతో విశేషమైనదని, బిల్లు రూపకల్పనలో విలువైన సూచనలు అందించిన వారికి మరియు పార్లమెంట్‌లో మద్దతు తెలిపిన వారందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.



# చింతకాని, బోనకల్లు మండలాల్లో విస్తృతంగా పర్యటించిన లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్, చింతకాని ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: జడ్పీ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గం ఇన్చార్జి శ్రీ లింగాల కమల్ రాజు గురువారం చింతకాని మండలం చిన్న మండవ మరియు బోనకల్లు మండలం రావినూతల గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. చిన్న మండవ గ్రామ మాజీ ఉపసర్పంచ్ పర్సగాని వీరబాబు గారి మాతృమూర్తి మరణించిన సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన డోకుపర్తి క్రిష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే బోనకల్లు మండలం రావినూతల గ్రామానికి చెందిన అజ్మీరా సుక్యా అనారోగ్యంతో మృతి చెందగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన దొండపాటి స్వామి ప్రమాదవశాత్తూ మరణించగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంతెన రమేష్, బొడ్డు వెంకట రామయ్య, వంకాయలపాటి లచ్చయ్య, బండి రామారావు, లాయర్ లక్ష్మి నారాయణ, కిషోర్, రావినూతల మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, ముదావత్ సైదానాయక్, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.



# తిర్లాపురం గ్రామంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక గ్రామసభ విజయవంతం



సందేశం టైమ్స్, చింతకాని ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: ఖమ్మం జిల్లా చింతకాని మండలం తిర్లాపురం గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ గ్రామసభకు గౌరవ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు అధ్యక్షత వహించగా, ప్రత్యేక అధికారిగా స్పెషల్ ఆఫీసర్ జి. ప్రశాంత్ పాల్గొన్నారు. ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వైద్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, హైస్కూల్ హెడ్‌మాస్టర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు, వివిధ సంక్షేమ పథకాలు, 99 రోజుల కార్యచరణ ప్రణాళికపై గ్రామ ప్రజలకు వివరంగా తెలియజేశారు. అలాగే గ్రామంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు మరియు భవిష్యత్ కార్యాచరణపై గ్రామసభలో చర్చించి పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఈ గ్రామసభ మరోసారి స్పష్టం చేసింది.

# సర్వాయి పాపన్న ఆశయాలను నెరవేర్చాలి: అదనపు కలెక్టర్ డా. శ్రీజ

సందేశం టైమ్స్, ఖమ్మం ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. గురువారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి అదనపు కలెక్టర్ డా. శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘ నాయకులు, తెలంగాణ జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, బచ్చు విజయ్ కుమార్, నూతి సత్యనారాయణ గౌడ్, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అమరగాని వెంకన్న, వడ్డెబోయిన నరసింహ గౌడ్, మార్కం లింగయ్య గౌడ్, ఉడుగు శ్రీనివాస గౌడ్, డాక్టర్ శ్రీనివాస గౌడ్, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, కోడి లింగయ్య, పగడాల నాగరాజు, షేక్ షకినా, అంబాల వెంకటేశ్వరరావు, తోడేటి దుర్గాప్రసాద్, పెరుగు వెంకటరమణ యాదవ్, జక్కుల వెంకటరమణ, బెల్లం కొండ శరత్, బండి నాగేశ్వరరావు, పెల్లూరి విజయ్ కుమార్, రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మేడికుందలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పేదల సొంతింటి కల సాకారం



సందేశం టైమ్స్, వట్పల్లి మండలం ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మేడికుంద గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తమ్మన్న జ్యోతి, ప్యారారం శివలీల, చాకలి సుజాత, చాకలి సబితలకు చెందిన నాలుగు ఇళ్లను మండలాధ్యక్షులు రమేష్ జ్యోషి, సర్పంచ్ చంద్రకళ కచూర్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు అవుతోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్రి విట్టల్, శంకరప్ప, నాగయ్య, హబీబ్, అశోక్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, దిగంబర్ రావు, వెంకట్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు



# హనుమాన్ జయంతి శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు మార్గాలను పరిశీలించిన ఎస్పీ పరితోష్ పంకజ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సదాశివపేటలోని హనుమాన్ దేవాలయాన్ని దర్శించుకుని పట్టణంలో నిర్వహించే శోభాయాత్ర మార్గాలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో డీజేలు వినియోగించరాదని, ఇతర మతాల భావాలను దెబ్బతినేలా పాటలు, నినాదాలు ఉండకూడదని సూచించారు. ర్యాలీలో పాల్గొనే వారు సహనంతో వ్యవహరించాలని, సోషల్ మీడియా రూమర్లను నమ్మరాదని హెచ్చరిస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట ఇన్స్పెక్టర్ డి. వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి ఐదు మండలాల్లో 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' ప్రయోగాత్మక అమలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: తెలంగాణలో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను గురువారం నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమనగల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ఈ పోర్టల్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. భూమికి సంబంధించిన ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలను ఒకే వేదికపై అందిస్తూ పారదర్శకత, వేగం పెంచడమే లక్ష్యమని, భూవివాదాల పరిష్కారానికి ఇది కీలక అడుగుగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రయోగాత్మక అమలులో వచ్చిన ఫలితాల ఆధారంగా అవసరమైన మార్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు.

# కొత్త రైతులకు గుడ్ న్యూస్ – ఏప్రిల్ 15 నుంచి రైతు భరోసా నిధుల జమ

సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: తెలంగాణలో కొత్తగా వ్యవసాయం ప్రారంభించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పాస్‌బుక్కులు జారీ అయిన రైతులను కూడా రైతు భరోసా పథకంలో చేర్చుతూ, ఏప్రిల్ 15 నుంచి 20 మధ్య నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 85 వేల మంది కొత్త రైతుల్లో ఇప్పటివరకు 62 వేల మంది దరఖాస్తులు సమర్పించగా వాటిని వ్యవసాయశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. అర్హులైన రైతుల జాబితాను త్వరలో ప్రకటించి వారికి ఆర్థిక సహాయం అందించనున్నారు. ఈ నిర్ణయం కొత్త రైతులకు పెద్ద ఊరటగా నిలవనుందని అధికారులు పేర్కొన్నారు.



# విద్యార్థుల్లో సృజనాత్మకత వెల్లివిరిసిన వంటకాల ప్రదర్శన

సందేశం టైమ్స్, వట్‌పల్లి మండలం ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వెల్లి పాఠశాలలో నిర్వహించిన "కండ కలవాడేను మనిషోయ్" కార్యక్రమంలో చిన్నారి విద్యార్థులు తరగతుల వారీగా వివిధ వంటకాలను తయారు చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. వర్షా (5వ తరగతి) బెల్లం నువ్వుల లడ్డు, జ్యోతిక బెల్లం గులాబ్ జామ్, మనిషా సేమియా, భానుప్రియ డబుల్ కా మీఠా, స్పందన పకోడీ, విశ్వేశ్వరి పల్లీలు–నువ్వుల చక్కిలు, శ్రీరామ్ సత్తుపిండి లడ్డూలు, రక్షణ పునుగులు, విశ్వతేజ మామిడి పులిహోరతో పాటు మునగాకు, కొత్తిమీర, కరివేపాకు, పుదీనాతో పచ్చడి తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఆమె విద్యార్థులకు కొబ్బరి పోలెలు, పులిహోర, జిలేబి పంపిణీ చేయగా, ఉపాధ్యాయుడు రితిన్ రెడ్డి ఫ్రూట్ సలాడ్ అందించారు. కార్యక్రమాన్ని సందర్శించిన జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు సాయి లీల విద్యార్థుల వంటకాలను రుచి చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. రవీందర్, సిహెచ్. సంగమేశ్వర్, టీ. నర్సింలు, సీఆర్పీలు సంగమేశ్వర్, గోపి సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుపై కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష

సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సంగారెడ్డి జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆభా ఖాతాల నమోదు సంఖ్యను పెంచి ప్రతి రోగికి తప్పనిసరిగా ఆభా ఐడీ నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఓపీ స్లిప్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో అప్లోడ్ చేయడం, ఫార్మసీ సేవలను డిజిటలైజ్ చేయడం, ఇంటర్నెట్ వేగాన్ని మెరుగుపరచి సేవల అందుబాటును పెంచాలని అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ద్వారా రోగుల ఆరోగ్య చరిత్ర, పరీక్షలు, చికిత్స వివరాలు ఒకే వేదికపై లభించి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన వైద్య సేవలు అందించవచ్చని పేర్కొంటూ అమలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత వైద్యాధికారులు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి - తోగార్పల్లిలో గ్రామ సభ విజయవంతం

సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తోగార్పల్లి గ్రామంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభను ఘనంగా నిర్వహించగా, పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని, ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం, పారిశుద్ధ్య నిర్వహణ, సంక్షేమ పథకాల అమలుపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో సంక్షేమం విస్తరిస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సబ్సిడీ వంటి పథకాల ద్వారా జిల్లాలో వేలాది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందుతున్నట్లు తెలిపారు. గ్రామ సభలో ప్రజలు తమ అర్జీలు, సూచనలు సమర్పించగా అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమం అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి - మంత్రి దామోదర్ రాజనర్సింహ




సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పేదల అభ్యున్నతే లక్ష్యంగా పలు పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ వైద్య పరీక్షలు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం రహదారులు, మౌలిక వసతులు కల్పించడంపై హామీ ఇస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని, మహిళా శక్తి, రేషన్ కార్డులు, కొత్త సంక్షేమ పథకాల అమలుతో ప్రజలకు మరింత మేలు చేకూరుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# బోరంచ గ్రామంలో ఘనంగా గ్రామసభ నిర్వహణ


సందేశం టైమ్స్, మనూర్ మండలం ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్ మండలం బోరంచ గ్రామంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా సర్పంచ్ బీరప్ప అధ్యక్షతన గ్రామసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారులు గ్రామస్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. గ్రామసభలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, వైద్య సదుపాయాలు, పింఛన్లు, గృహాల నిర్మాణం వంటి కీలక సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామసభలో వచ్చిన ప్రతి సమస్యను నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాము, సర్పంచ్ పంచగామ బీరప్ప, ఉపసర్పంచ్ మొల్ల కరిమ్, సెక్రటరీ సంతోష్, పాలకవర్గ సభ్యులు, యువకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సాయిపేటలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్ అల్లూరి సంతోష అంజనేయులు



సందేశం టైమ్స్, వట్‌పల్లి మండలం ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం సాయిపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించగా, గ్రామ సర్పంచ్ అల్లూరి సంతోష అంజనేయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొర్పోలు విష్ణు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గృహప్రవేశం సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్నదని అన్నారు. ప్రతి అర్హత గల కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు




సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, 03 ఏప్రిల్ 2026: సంగారెడ్డి జిల్లాలో బహుజన చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి 316వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వారి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాపన్న గౌడ్ గారి ఆశయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల రూపంలో కొనసాగిస్తున్నామని తెలిపారు. వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తూ ఆయన నిర్మించిన కోటలను పర్యాటక, పురావస్తు కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జ్ అనిల్ వివాహం ఘనంగా



అల్లాదుర్గం, ఏప్రిల్ 3: ప్రతినిధి మెదక్ జిల్లా ఇంచార్జ్ అనిల్ కుమార్ వివాహ వేడుక బహిరంగంగా, ఘనంగా జరిగింది. బహిరన్ రిబ్బ గ్రామంలో జరిగిన ఈ వేడుకకు సందేశం టైమ్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్, అందోలు నియోజకవర్గం ఇంచార్జ్ మల్లేశం గౌడ్, మెదక్ నియోజకవర్గం ఇంచార్జ్ మన్నె పోచయ్య, సంగారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ కే. సంగమేశ్వర్ తదితరులు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.హాజరైన అందరూ వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి, సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఆనందంతో జీవించాలని ఆకాంక్షించారు. వివాహం సాంప్రదాయ కార్యక్రమాలు, సంగీతం, నృత్యం, ఉత్సాహాల మధ్య ఘనంగా ముగిసింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరుల సమక్షంలో వధూవరులు కొత్త జీవితానికి సంతోషంగా అడుగుపెట్టారు.

## ఉట్ల గ్రామస్తులు అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు



సంగారెడ్డి, ఏప్రిల్ 3 , పటాన్చెరుటౌన్ రిపోర్టర్ వి. సాయి, పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఉట్ల గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి జన్మదిన వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, మహా ప్రదక్షిణ కార్యక్రమాలు జరిపి వేడుకలు జరుగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి కృపతో ఆయురారోగ్యాలు లభించాలని గ్రామస్తులు ప్రార్థించారు.

## వడియారామ్ గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రజాపాలన గ్రామసభకు హాజరు



మెదక్, ఏప్రిల్ 3: నియోజకవర్గం ప్రతినిధి, చేగుంట మండల కేంద్రంలోని వడియారామ్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. రాష్ట్ర గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి ప్రసంగాన్ని సర్పంచ్ ఎ. సాయి కుమార్ వినిపించారు.ప్రత్యేక అధికారిణి హేమ భార్గవి, సర్పంచ్ సాయి కుమార్, మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ బండారి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ఇన్చార్జ్ ఎంపీఓ విజయపాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## పటాన్చెరు శోభాయమానంగా హనుమాన్ జయంతి వేడుకలు

పటాన్చెరు, ఏప్రిల్ 3: సందేశం టైమ్స్ బి. డేవిడ్, గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకుని పటాన్చెరు డివిజన్‌లోని గౌతంనగర్ మహాదేవుని ఆలయం, చైతన్య నగర్, నర్ర బస్తి, శాంతినగర్, జెపి కాలనీ, పంచముఖి హనుమాన్ దేవాలయాల్లో వేడుకలు జరిగాయి. నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.హిందువులు సనాతన ధర్మాన్ని పాటించాలని, హనుమంతుని జీవితం భక్తి-శక్తి-ధైర్యానికి ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం పంచముఖి దేవాలయం వద్ద వీర హనుమాన్ శోభాయాత్రను జండా ఊపి ప్రారంభించారు.

## ఇంద్రేశం మున్సిపాలిటీలో ప్రజాపాలన కార్యక్రమం ఘనంగా



పటాన్చెరు, ఏప్రిల్ 3: సందేశం టైమ్స్ బి. డేవిడ్, పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని ఐనోల్ గ్రామంలో 3వ, 16వ వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చ జరిగింది. మహిళా ప్రతినిధి సమస్యలను చదివి వినిపించారు.రహదారులు, త్రాగునీరు, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు, యువత పాల్గొని ప్రజాపాలనను బలోపేతం చేయాలని సంకల్పించారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో వట్పల్లి అధ్యక్షులు, నాయకులు



సంగారెడ్డి, మార్చ్ 3: అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేశ్ బాబు ,అందోల్ నియోజకవర్గం వట్పల్లి మండలం మెడికుంద గ్రామంలో ఇందిరమ్మ గృహప్రవేశంలో వట్పల్లి అధ్యక్షులు, ప్రతాప్ రమేష్ జ్యోషి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ నాలచెరువు చంద్రకళ కచూరి, ఆత్మకమిటీ చైర్మన్ కచూరి, మాజీ జడ్పీటీసీ విట్టల్, మాజీ సర్పంచ్ నాగరత్న అశోక్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శంకరప్ప, యూత్ అధ్యక్షులు వెంకట్ పాటిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అభిబ్, దిగంబర్ యువజన నాయకులు ప్రవీణ్ గౌడ్, పోచయ్య, సర్పంచ్‌లు రవీందర్, శ్రీనివాస్, మోహన్, యూత్ కాంగ్రెస్ వినోద్, ఉపసర్పంచ్ నాగన్న, ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు హాజరయ్యారు.



## ఇంద్రేశంలో అంగరంగవైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

పటాన్చెరు, ఏప్రిల్ 3: పటాన్చెరు టౌన్ రిపోర్టర్ వి. సాయి ,పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో హనుమాన్ జయంతి పురస్కరించుకుని హనుమాన్ ర్యాలీ నిర్వహించారు. పులిహోర ప్రసాదం పంచి, హనుమాన్ ఆలయం నుంచి చత్రపతి శివాజీ విగ్రహం వరకు ర్యాలీ తీర్పించారు. ప్రజలు సనాతన ధర్మాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. హనుమంతుడు శ్రీరామ క్షేమార్థం శరీరంతా సింధూరం అలంకరించినట్టు మనం హిందూ ధర్మం కోసం భక్తితో నడవాలని స్థానికులు తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ విజయవంతం చేశారు.

## ప్రజల సంక్షేమమే పరమావధి.. ప్రభుత్వ పథకాలు: అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, ఏప్రిల్ 3: నియోజకవర్గం ప్రతినిధి, అల్లాదుర్గ్ మండలం చిల్వార్ గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని, పారదర్శకంగా గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు.పంచాయితీ కార్యదర్శి ఆర్. లింగప్ప వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు చదివి వినిపించారు. గ్రామ సర్పంచ్ ముక్కెర శశిధర్ రెడ్డి ప్రజలకు పథకాలు చేరేలా కృషి చేస్తామన్నారు. ఉపసర్పంచ్ చాకలి లక్ష్మి, వార్డు సభ్యులు, ప్రత్యేక అధికారి ఏ. వైష్ణవి, మండల వైద్యాధికారి సారిక, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక: ముఖ్యమంత్రి గ్యారెంటీలు పారదర్శకంగా



మెదక్, ఏప్రిల్ 3: సందేశం టైమ్స్ ప్రతినిధి, తెలంగాణ ప్రభుత్వం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ₹500 గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు అర్హులకు చేరేలా చూడటం, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, సమస్యల పరిష్కారం లక్ష్యాలు.టేక్మాల్ మండలం స్పెషల్ ఆఫీసర్ డిపిఓ యాదయ్య, సర్పంచ్ తిమ్మి సుధాకర్, ఉపసర్పంచ్ మేకల కాడి శంకరయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ రమేష్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ మజహర్, డిసిసి జనరల్ సెక్రటరీ ఆసీల సాగర్, ట్రాన్ ప్రెసిడెంట్ భక్తుల కిషోర్, మాజీ సర్పంచ్ అగుల్లపల్లి పాపయ్య, ఆశ వర్కర్లు, హెల్త్ సూపర్వైజర్ భూదేవి, అంగన్వాడి, టీచర్లు, అగ్రికల్చర్ ఏవో మంజుల నరసింహులు, సిబ్బంది, వార్డు మెంబర్లు (శివ గౌడ్, ప్రభ, భాగ్యలక్ష్మి, భోగం శ్రీలత, బోగం వీరేశం, ఎర్రోళ్ల రమేష్, బాలకృష్ణ, సాయి శేషు గౌడ్), బీజేపీ నాయకులు (ఎల్లుపేట రాజు, భోగం శివశంకర్, పోచయ్య) తదితరులు పాల్గొన్నారు

## హనుమాన్ జయంతి సందర్భంగా ఐక్యత సందేశం – భారీ బైక్ ర్యాలీ



పుల్కల్ మండలం, ఏప్రిల్ 3: సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం పుల్కల్ మండలంలో విశ్వహిందూ పరిషత్ జోగిపేట ప్రఖండ ప్రముఖ్ కరుణాకర్, హిందువులు ఐక్యంగా ఉండి సమాజాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కొర్పోల్ సీతారామాలయంలో హనుమాన్ జయంతి సమావేశంలో మాట్లాడారు.విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పెద్దారెడ్డిపేట నుంచి కొర్పోల్ వరకు 25 కి.మీ. హనుమాన్ విగ్రహంతో బైక్ ర్యాలీ తీర్పించారు. భక్తులు చాలీసా పారాయణం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, భోజనం పంచారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ పోసానిపేట్‌లో




సంగారెడ్డి అందోల్ మండలం, ఏప్రిల్ 3: ప్రతినిధి వి. వెంకటేశం తెలంగాణ ప్రభుత్వం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ₹500 గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు పారదర్శకంగా అందించడం, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, సమస్యల పరిష్కారం లక్ష్యాలు. అందోల్ మండలం పోసానిపెట్ గ్రామంలో గ్రామసభ జరిగింది.స్పెషల్ ఆఫీసర్ ఏపిఎం దేవేందర్, ఆర్ఐ మహేందర్ రెడ్డి, సర్పంచ్ గంట్టా గోపాల్, ఉపసర్పంచ్ గంట్టా రాములు, సెక్రటరీ షాజు, ఆశ వర్కర్లు, అంగన్వాడి, టీచర్లు, వివో ఏ. నగేష్, వార్డు మెంబర్లు (ఎం. అనిత, ఎం. అశోక్, ఎం. ప్రభార్, బి. మధు, వి. వెంకటేశం), రేషన్ డీలర్ శివశంకర్, సీసీ ఎండి ఆఫీసర్, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొని సభ విజయవంతం చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.